క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం సందర్శన



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార: ఇటీవల ఆధునీకీకరణ పనులు పూర్తి చేసుకున్న అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు సందర్శించారు. కార్యాలయంలోని అన్ని గదులతో పాటు ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాన్ని అందంగా తీర్చిదిద్దినందుకు తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్‌ను కేకే రాజు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చేతన్‌కుమార్, ఆర్.రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్ర లేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. గ్రంథాలయ కమిటీ సభ్యుడు రైల్వే డివిజనల్ లోకో షెడ్ ఇంజినీర్ జామి అన్నాజీరావు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంలో భాగంగా కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

17న దుకాణాలకు బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఈ నెల 17న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆశీలుమెట్ట వద్ద గల జోన్–3 కార్యాలయంలో ఈ వేలం జరగనుందని జోనల్ కమిషనర్ జె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు జోన్–3 కార్యాలయం పని వేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

మద్దిపాలెం: కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడిన ఘటన మంగళవారం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పి.అప్పన్న బతుకు తెరువు కోసం విశాఖకు వచ్చారు. పోర్టులో కూలి పనులకు వెళ్తుంటాడు. జ్ఞానాపురం బ్రిడ్జి కిందనే జీవనం సాగిస్తుంటాడు. ఇతనితో పాటు ఒడిశాకు చెందిన రమాకాంత్ నాయక్ కూడా పనికి వెళ్తుంటాడు. అయితే మంగళవారం ఉదయం అప్పన్న బ్రిడ్జి కింద కూర్చొని ఉండగా, మద్యం మత్తులో ఉన్న రమాకాంత్ నాయక్ వచ్చి దుర్భాషలాడాడు. అంతటి ఆగకుండా పక్కనే ఉన్న బీరు సీసాతో అప్పన్నను కొట్టడంతో ఎడమ చేతి కింద ఛాతీ భాగంలో గాయాలయ్యాయి. అప్పన్న ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విభాగానికి ప్రింటర్ బహూకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు విభాగానికి నూతన ప్రింటర్‌ను బహూకరించారు. తాము చదువుకున్న విభాగానికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులు నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేసి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుకు అందజేశారు. విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాశరావు, ఆలీ, రాము, పాల్గొన్నారు.

మెట్ల మార్గాలకు మోక్షమెప్పుడో?

- కొండవాలులో నాచుపట్టి, శిథిలావస్థలో మెట్లు
- పట్టించుకోని జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు

కంచరపాలెం: శిథిలమైన మెట్ల మార్గాలు.. అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ.. వర్షాలకు జారీ పడుతున్న మట్టి పెళ్లలు.. వెలగని విద్యుత్ దీపాలు. ఇదీ కొండవాలు ప్రాంతాల్లో అడుగడుగునా కనిపిస్తున్న సమస్యలు. జీవీఎంసీ 47, 48 వార్డుల పరిధి కంచరపాలెం పరిసర కొండవాలు ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి సమస్యలతో సావాసం చేస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారు.

ఇవీ సమస్యలు

- మెట్ల మార్గాల్లో సిమెంట్ రోడ్లు వేయకపోవడంతో వర్షాలు కురిసేటప్పుడు రాళ్లు తేలుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ల మార్గాలు నాచు పట్టి ప్రమాదభరితంగా మారాయి. పల్నాటి కాలనీ, రాంజీ ఎస్టేట్, అరుంధతినగర్, సాయిరామ్‌నగర్, బాపూజీనగర్, శివలింగాపురం, శ్రీనివాసనగర్, ఇందిరానగర్, జైభారత్‌నగర్ తదితర ప్రాంతాల్లో మెట్ల మార్గాలు నాచు పట్టి శిథిలావస్థకు చేరాయి.
- కొండవాలు ప్రాంతాల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదు. వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చేందుకు సిబ్బంది ముందుకు రావడం లేదు.
- ఆయా వార్డుల్లో ఇటీవల కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, కాలువలు, మెట్లమార్గాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదని స్థానిక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మెట్ల మార్గాలతో పాటు కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



శివలింగపురంలో ప్రమాదభరితంగా ఉన్న మెట్ల మార్గం



పల్నాటి కాలనీలో అధ్వానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ

మెట్ల మార్గాలు బాగు చేయండి



కొండవాలు ప్రాంతాల్లో కాలువలు, మెట్ల రహదారుల్లో రాళ్లు తేలుతున్నాయి. ఈ మార్గాల్లో నడవాలంటే భయంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. తక్షణం మెట్ల మార్గాలను అధికారులు బాగు చేయాలి.
– కె.దేవి, శివలింగపురం,

ప్రమాదాల బారిన పడుతున్నాం..



మెట్ల మార్గాలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. చినుకు పడితే నాచు పడుతుంది. అటుగా రాకపోకలు సాగించాలంటే భయాందోళనగా ఉంది. పనులు జరిగే దాఖలాలు కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలి. – రమణమ్మ, పల్నాటి కాలనీ

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు బాగా మంజూరవుతున్నాయి. కొండవాలులో మెట్లమార్గాల మరమ్మతులకు ఇప్పటికే టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. కొండ ప్రాంతం కావడంతో అధిక మోత, కాంట్రాక్టర్లు లేబర్ చార్జీలు పెంచకపోవడంతో ఇక్కడ పనులకు కూలీలు కూడా దొరకడం లేదు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
–శ్రీనివాసరావు, ఈఈ, జోన్–5, జ్ఞానాపురం

ప్రజలకు పాలన చేరువ చేసిన సీఎం జగన్

- భీమిలి ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 45వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సింహగిరి కాలనీలో కాలువల గురించి అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తాటిచెట్లపాలెం: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల చెంతకే పాలన చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన వైఎస్ జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. మంగళవారం జీవీఎంసీ 45వ వార్డు, భీమిలి నియోజకవర్గం పరిధిలోని కొండవాలు ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. సింహగిరి కాలనీలో పలు చోట్ల ఓపెన్‌గా ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు ఆయన సూచించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వెంటనే వీధి లైట్లు వేయాలని జీవీఎంసీ అధికారులకు చెప్పారు. శిథిలావస్థలో ఉన్న బాల్యం భవనం విషయంపై ఆరా తీశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వల్ల కలుగుతున్న లబ్ధిని ప్రజలకు వివరించారు.

దేవస్థానం భూసమస్యకు త్వరలో పరిష్కారం

సింహాచలం దేవస్థానం భూసమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని ముత్తంశెట్టి తెలిపారు. సమస్య కోర్టు పరిధిలో ఉండడం వల్ల ఏమీ చేయలేకపోతున్నామని, అయినా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పరిష్కారం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యను ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించారని, అలాగే ఈ సమస్య కూడా త్వరలోనే శాశ్వతంగా పరిష్కారమవుతుందని తెలిపారు. జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాలైన సింహగిరికాలనీ, సింగాలమ్మపురం, సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ–1, 2 తదితర ప్రాంతాల్లో చాలా మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సుమారు 30 సంవత్సరాలు అవుతుందని, ఇవి శిథిలావస్థకు చేరాయని, కనీసం మరమ్మతులకైనా అనుమతులిప్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాండురంగ, సివో జయలక్ష్మి, పోలీసు సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు, వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు, పార్టీ నాయకులు సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, కారుకొండరాజు, ఆదిలక్ష్మి, తవుడమ్మ, కాలనీ పెద్దలు కృష్ణమూర్తి, తిరుమలరావు, ఆర్పీలు మహేశ్వరి, పైడిరాజు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ కళకళ



సత్యం సెంటర్ వద్ద ఓపెన్ జిమ్ సందడి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పిల్లలు, పెద్దలతో కళకళలాడుతోంది. కార్పొరేటర్లు ఏడాది పదవీ కాలం పూర్తయిన సందర్భంగా వార్డు అభివృద్ధి కోసం జీవీఎంసీ రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ హైవే పక్కన గ్రీన్‌బెల్ట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. వ్యాయామానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండటంతో గణేష్‌నగర్, గొల్లవీధి, కనకమ్మవీధి, హరిజన వీధి, రెల్లివీధి ప్రాంతాలకు చెందిన పలువురు ఓపెన్ జిమ్‌కు తరలివస్తున్నారు. నివాసాలకు దగ్గరగా ఉండడంతో మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఓపెన్ జిమ్‌లో సందడి నెలకుంటోంది. ఇక్కడ ఇటీవల వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో మరింత ఉపయుక్తంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కవితలు పంపేందుకు ఈ నెల 18 చివరి తేదీ

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు కవితలు పంపేందుకు ఈ నెల 18వ వరకు గడువు పొడిగించినట్టు ట్రస్ట్ ప్రతినిధి సాలిపల్లి మంగావేణి ఒక ప్రకటనలో తెలిపారు. 75 సంవత్సరాల జనజీవనం అంశంపై కవితలు రాయల్సి ఉంటుదని పేర్కొన్నారు. కవితలను డాక్టర్ నండూరి రామకృష్ణ, ప్లాట్ నంబర్–132, సెక్టార్–8, ఎంవీపీ కాలనీ చిరునామాకు పంపించాలన్నారు. ఈ నెల 28న పౌర గ్రంథాలయంలో నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సోనియాగాంధీ నగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సోనియాగాంధీనగర్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు మంగళవారం శంకుస్థాపన చేశబూరు. సోనియాగాంధీనగర్, వైఎస్సార్ నగర్‌లో ఉన్న గృహసముదాయాలకు సంబంధించిన పాడైన సెప్టిక్ ట్యాంక్, పైప్‌లైన్‌ల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ పనలకు సంబంధించి జీవీఎంసీ సుమారు రూ.19.8 లక్షలు మంజూరు చేసింది. పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు కాంట్రాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సోనియాగాంధీ నగర్ అధ్యక్షుడు డి.రాము, ఆర్పీ సాజీలతో పాటు పార్టీ నాయకులు నేపాల్ శ్రీను, నాయుడు, మహేష్, సన్ని, దుర్గ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ చైతన్య పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్తు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన శ్యామ్‌దాస్, అవినాష్.. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విశాఖ రైల్వేస్టేషన్ పోస్టు ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. అటు వైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. 8 కిలోల గంజాయి గుర్తించారు. ఫోర్తు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు

గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట దరి షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలోని ఒక ఇంటి మేడపై ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో ద్వారకా ఎస్‌ఐ అప్పలరాజు, టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ రమణ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి పౌడర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రెండు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం: షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి. ఈ రెండు రైళ్లు ఆలస్యంగా చేరుకున్న కారణంగా ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం'



మట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సీతమ్మధార: జగనన్నకు చెబుతాం–1902 టోల్ ఫ్రీ నంబర్ కార్యక్రమాన్ని మంగళవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవెన్యూ శాఖ, పోలీసు అధికారులు, సచివాలయ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ, తహసీల్దార్లు పి..శ్యామ్‌ప్రసాద్, రమణయ్య, ద్వారకా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మూర్తి, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సీఐలు రామారావు, సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు, మల్లీశ్వరరావు, సోమశేఖర్, ఎన్.సాయి, షణ్ముఖరావు, డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, ఆర్‌ఐ రవికృష్ణ, ఎస్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థికి రజతం



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్

సీతంపేట: ఇటీవల కేరళ అలప్పుజాలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడు. బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎం.దుర్గాప్రసాద్ 93 కిలోల విభాగంలో తలపడి బెంజ్ ప్రెస్‌లో రజత పతకాన్ని, స్క్వాడ్ 265 కేజీల్లో రజత పతకం, డెడ్ లిఫ్ట్ 240 కేజీల్లో రజత పతకాన్ని గెలుపొంది, మొత్తంగా 665 కిలోలు ఎత్తి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కో ఆర్డినేటర్ లక్ష్మణబాబు, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని అభినందించారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి పూజలు



లలితా పీఠంలో పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష్మీ గణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితా పీఠంలో మంగళవారం సాయంత్రం వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణనాథునికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనిలో భాగంగా పీఠం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివి వినిపించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తకంగా గణపతి హోమం చేశారు. బహుళ అష్టమిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు చండీ హోమం, సాయంత్రం 6.30 గంటలకు కాళీ కాలభైరవ హోమం నిర్వహించనున్నట్టు కృష్ణసేన్ తెలిపారు. సీతంపేట కూడలిలో దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లో విజయగణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు చేశారు.

ప్రజా శ్రేయస్సు, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కేకే రాజు, రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: ప్రజా శ్రేయస్సు, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 51వ వార్డు మాధవధారలో మంగళవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన పర్యటించారు. 291 సచివాలయం పరిధిలో ఉన్న శంకర్‌నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల శ్రేయస్సు కోసమే ప్రతి క్షణం పాటు పడుతున్నారని చెప్పారు. ప్రజలందరి సహకారం, చల్లని దీవెన ముఖ్యమంత్రి జగన్‌పై 2024లో కూడా ఉంచి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పైడి శ్రీను, రాయుడు శ్రీను, జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఆళ్ళ శివ గణేష్, సునీల్, 51వ వార్డు నాయకులు తిరుమలరావు, పైడి ప్రతాప్, రత్నం, వై.వరలక్ష్మి, లత, రాణి, బి.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం సందర్శన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జీను మహేష్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్ సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి విజ్ఞానాన్ని అందిస్తున్నారు.. అందుకు చేపట్టిన శిక్షణా కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులతో మాట్లాడి వసతుల కల్పనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రంథాలయ విజ్ఞానాన్ని విద్యార్థులు ఒడిసి పట్టాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం సాధ్యమవుతుందని చెప్పారు. శిక్షణా శిబిరంలో భాగంగా 2వ రోజు కథలు చదవడం, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు.

వైభవంగా దుర్గమాంబ జాతర

అమ్మవారిని దర్శించుకున్న మేయర్ ఇతర ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ దంపతులు



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు శర్మ

కంచరపాలెం: కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తొలిపూజ గ్రామ కమిటీ సభ్యులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలతో దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నగర మేయర్ గొలగాని వెంకట హరికుమారి దంపతులు, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు రాజశేఖర్, రజిని, వాణీనానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో శ్రీరామ సేవా సమాజం వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 49 ఘటాలను ఆలయానికి చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాలు, నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాత్రపల్లి వెంకటరమణ, వై.వి.రావు, వై.ఎ.రావు, ఎస్.ఎస్.కుమార్, పి.పెంటి నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'రామోజీ మోసాలకు సూత్రధారి చంద్రబాబే'



పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, అర్బన్ కాపు సంఘం అధ్యక్షుడు

తాటిచెట్లపాలెం: ఇటీవల మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించిన చర్చా వేదిక ద్వారా మార్గదర్శి, రామోజీలు ఏ విధంగా ప్రజలను మోసం చేశారో తెలిసిందని, ఈ మోసాల వెనక ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ వేదిక ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్ అవకతవకలు, దోపిడీ విధానం, ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో తెలియజేశారన్నారు. ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటూ రామోజీరావు మోసాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారని ఆయన విమర్శించారు. రాష్ట్రాన్ని దోచుకున్న పెద్ద దొంగలు రామోజీ, చంద్రబాబులు దొరల్లా చలామణి అవుతున్నారన్నారు. వీరిని నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని తెలిపారు. వీరికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇటువంటి చర్చావేదికల ద్వారా నిజాలు తెలుస్తాయని, మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరచాలని రవీంద్రనాథ్ ఠాగూర్ కోరారు.